క్లుప్తంగా

శాకంబరీదేవిగా కొండలమ్మ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పుష్పాలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని మొక్కు బడులను చెల్లించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారికి భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఏర్పాట్లు చేశారు.

ముగిసిన సత్యసాయి వ్రతాలు



గుడివాడ టౌన్: శ్రీ ద్వారకా సాయి సేవా సమితి ఆధ్వర్యంలో షిర్డీ సత్యసాయి వ్రతాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సేవా సమితి 32వ వార్షిక గురు పౌర్ణమిని పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని నాగన్న సత్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా, స్వామివారికి అభిషేకాలు, భక్తుల కోలాటం, ప్రత్యేక అర్చనలు ఈ సందర్భంగా నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, ఉపాధ్యక్షుడు మరీదు శ్రీనివాసరావు, కోశాధికారి లక్ష్మి, కార్యవర్గ సభ్యులు దండమూడి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి లోడు లారీ దగ్ధం



గుడివాడ టౌన్: ప్రమాద వశాత్తు వరిగడ్డిలోడు లారీ దగ్ధమైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 37టీఏ 2277 నంబరు గల లారీ గడ్డి లోడు చేసుకుని బాపులపాడు మండలం కానుమోలు నుంచి కూచిపూడి గ్రామానికి బయలుదేరింది. స్థానిక బైపాస్ రోడ్డు పక్కన లారీని నిలిపి డ్రైవర్ భోజనానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయానికి లారీ దగ్ధమవడం గమనించాడు. వెంటనే పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి లారీని తరలించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉందని అధికారులు అంటున్నారు.

అగ్ని బాధితునికి సాయం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం దేవరకోట ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఆటో డ్రైవర్ కొడాలి వెంకటేశ్వరరావు కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు స్పందించి దాతల సహాయంతో ఈ మొత్తాన్ని సమకూర్చారు. వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, ఎంపీటీసీలు కొడాలి నాగార్జున, దిరిశం వెంకట లక్ష్మి, కొప్పుల రాములమ్మ, కొల్లూరి విజయ, కొండేటి నీలవేణి, సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి దిరిశం పిచ్చేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

లంకమ్మకు ఘటం బిందెల సమర్పణ

అవనిగడ్డ: లంకమ్మ అమ్మవారికి రెండో వార్డులోని కొనకళ్ల సుబ్బారావు కుటుంబానికి చెందిన 17 మంది ఒకేసారి ఘటం బిందెలు సమర్పించారు. కొనకళ్ల కాంప్లెక్స్ నుంచి 17 మంది కొనకళ్ల కుటుంబీకులు ఒకేసారి ఘటం బిందెలు ఎత్తుకుని లంకమ్మ అమ్మవారి ఆలయం వరకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. తీన్మార్ డప్పులు, డప్పు వాయిద్యాలు నృత్య ప్రదర్శన చేస్తూ ప్రత్యేక ప్రభతో తరలి వెళ్లిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేసి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దారి పొడవునా భక్తులకు పానకం అందించారు.

ఉన్న ఊర్లోనే సేవలు

- మండల కేంద్రాలకు వెళ్లవలసిన అవసరం లేదు
- నాలుగేళ్లుగా సేవలు అందిస్తున్న రైతుభరోసా కేంద్రాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



కియోస్క్ యంత్రంతో ప్రయోజనాలు..

గుడివాడరూరల్: గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయాలకు తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయి. రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరమయ్యాయి. సొంత ఊరిలోనే అన్ని రకాల సేవలు అందేలా ఆర్‌బీకే సెంటర్లు రైతులకు సేవలను అందిస్తున్నాయి.

ఎరువులు, విత్తనాల పంపిణీ..

ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీల కొరకు మండల కేంద్రాలకు వెళ్లి రైతులు ఆరా తీసుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు సొంత గ్రామాల్లో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ఎరువులు, విత్తనాలను పొందుతున్నారు. సబ్సిడీపై ఇచ్చే వ్యవసాయ పనిముట్లను గ్రామాల్లోనే రైతు సంఘాల ద్వారా పొందుతున్నారు.

పంట నష్టపరిహారం, ఈక్రాఫ్ బుకింగ్..

గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. పంట నష్టం వలన కలిగే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంక్‌లు రైతులకు రుణాలను అందించే సౌకర్యం కలుగచేసింది.

కియోస్క్ యంత్రంతో ప్రయోజనాలు..

రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు వరంలా మారాయి. ఆయా గ్రామాల్లో రైతులకు కావాల్సిన అన్ని రకాల సబ్సిడీ ఎరువులు, విత్తనాలను 48గంటల్లోనే నేరుగా రైతులకు అందుతున్నాయి. యంత్రాల ఏర్పాటు వలన ఎంతో ప్రయోజనం పొందుతున్నామని రైతులు ఈ సందర్భంగా పేర్కొంటున్నారు.

మండలంలో లబ్ధి పొందిన రైతులు..

గుడివాడ మండలంలో రైతుభరోసా కేంద్రాలు	14
మొత్తం రైతులు	12,500
రైతు భరోసా మంజూరైన రైతులు	4500
ఏడాదికి పొందిన లబ్ధి	రూ.6.6కోట్లు
నాలుగేళ్లలో పొందిన లబ్ధి	రూ.26.42కోట్లు
ఎరువులు, విత్తనాలు అందుకుంటున్న రైతులు	8,524
వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పొందిన రైతులు	90

రైతుభరోసా నాలుగేళ్లుగా వస్తోంది..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్‌బీకే సెంటర్లు చాలా ఉపయోగపడుతున్నాయి. నాకు నాలుగేళ్లుగా రైతుభరోసా వస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు ప్రభుత్వం ఇచ్చే రైతుభరోసా ఎంతో ఉపయోగపడుతుంది.

–మట్టా లక్ష్మయ్య, రైతు బొమ్ములూరు

ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి..



ఆర్‌బికెలో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించడంతో రైతులకు మేలు జరుగుతుంది. సీజన్‌తో సంబంధం లేకుండా ఆర్‌బికెలో అన్ని రకాల సౌకర్యాలు రైతులకు అందుతున్నాయి. మార్కెట్ ధర కంటే ఆర్‌బికెలో రైతులకు ఎరువులు, విత్తనాలు తక్కువ ధరకే లభిస్తున్నాయి. ఇవి రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

–కుందేటి సత్యనారాయణ, రైతు, బొమ్ములూరు

ఈ క్రాప్‌తో రైతులకు మేలు..



రైతు భరోసా కేంద్రం సిబ్బంది ఖరీఫ్, రబీ సీజన్‌లలో చేపట్టే ఈక్రాప్ బుకింగ్ ఎంతో మేలు చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పంట నష్టపరిహారం చెల్లిస్తున్నారు. రైతుల కోసం కష్టపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–శొంఠి వెంకటదుర్గారావు,రైతు, బొమ్ములూరు

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే డీఎన్నార్



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు ఆశీస్సులు అందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి-2 సచివాలయ పరిధిలో రూ.70 లక్షలు నిధులతో మంజూరైన రెండు డ్రెయిన్లు, మైక్రో వాటర్ ఫిల్టర్లను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, మరో రూ.20 లక్షలు ఇతర నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఒక్క కలిదిండిలోనే రూ.1.50 కోట్ల నిధులను అభివృద్ధి పనులకు కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసిముక్కుల మారుతి ప్రసన్న, ఉపసర్పంచ్ ముత్తిరెడ్డి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగబాబు, పంచాయతీ కార్యదర్శి రాగాల ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

గుర్వాయిపాలెంలో..

కలిదిండి మండలం గుర్వాయిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే డీఎన్నార్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ, సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ నల్లూరి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలకోసమే ఆరోపణలు

- అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం నాటకం
- ఎంపీటీసీ వేమూరి మోహన్

గుర్విందగుంట(పెదపారుపూడి): అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య నాటకంపై గ్రామంలోని ప్రజల సమక్షంలో తాను బహిరంగ చర్చకు సిద్ధం.. నీవు సిద్ధమా అని ఎంపీటీసీ వేమూరి మోహన్, వర్ల కుమార్ రాజాకు సవాల్ విసిరారు. మండలంలోని గుర్విందగుంట గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్త అన్నపూర్ణ ఆత్మహత్య నాటకంపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త పిల్లలకు వచ్చే పోషకాహారాల్లో అక్రమాలకు పాల్పడుతుందని పిల్లల తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకుని వస్తే ప్రజా ప్రతినిధిగా వెళ్లి ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో రికార్డులు పరిశీలించామన్నారు. 11 మంది పిల్లలకు హాజరు చూపించగా అంగన్‌వాడీలో ఉంది ఒక్కరు మాత్రమే అని తేలిందన్నారు. పై అధికారులు విచారణకు వెళ్లగా అవకతవకలకు పాల్పడిందని తెలియటంతో ఎక్కడ ఉద్యోగం పోతుందో అని ఆత్మహత్యాయత్నం చేసి నాటకం ఆడిందన్నారు. దీనిని అడ్డం పెట్టుకుని వర్ల కుమార్ రాజా గుడివాడ అస్పత్రికి వెళ్లి స్వార్థ రాజకీయాల కోసం తనపై లేనిపోని అసత్య ప్రచారాలు చేశారన్నారు. నా తప్పు ఉంటే ఎంపీటీసీ పదవికి రాజీనమా చేస్తా, నీ ఆరోపణలు తప్పైతే పామర్రు టీడీపీ నుంచి తప్పుకుంటావా అని ప్రశ్నించారు. వార్డు మెంబరుగా గెలవని నీవు జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు నర్రా కృష్ణారావు, వేమూరి సత్యనారయణ, ఎం.శ్రీనివాసరావు, నాగబాబు, మాధవరావు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె



మండవల్లిలో శ్రీ కనకదుర్గా ఆలయంలో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

మండవల్లి: మండవల్లిలో శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నెలకొన్న శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో కొలువైఉన్న దుర్గ అమ్మవారికి ఏలూరుకు చెందిన కొనకళ్ల వరదరాజు ఆదివారం పుట్టింటి తరఫున చీర, సారె సమర్పించారు. స్థానిక భక్తులు పలువురు అమ్మవారికి పసుపు కుంకుమలు, సారె సమర్పించి వేడుకున్నారు. దయాదాక్షిణ్యాలతో కనికరించు తల్లీ అని అమ్మవారిని ప్రార్థించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారికి ప్రత్యే పూజలు చేశారు. ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ పూజలు నిర్వహింపజేశారు.

నేడు మెగా వైద్య శిబిరం

బంటుమిల్లి: యువ గణేష్ మోటారు సైకిల్ మెకానికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంటుమిల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని చెప్పారు.

వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



ఆస్పత్రిలో వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కలిదిండి ఏఎంసీ మాజీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు అస్వస్థతకు గురై కలిదిండిలోని అమ్మా హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు చినతడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు, పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్త చిట్టూరి బుజ్జి, మారుబోయిన విష్ణు, మండా నవీన్ ఉన్నారు.

మెకానిక్‌లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండల బైక్ మెకానిక్, ఆటో మొబైల్స్, బ్యాటరీస్, టైర్స్, ఎలక్ట్రికల్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల స్థాయి సమావేశాన్ని ఆదివారం పెదపూడిలోని శాంతి కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు షేక్ రియాజ్, ఈడే శివనాగేశ్వరారవు పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రతి టూ వీలర్ మెకానిక్‌లకు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, టూ వీలర్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా ఇవ్వాలని, 55 సంవత్సరాలు దాటిన అర్హులైన పేద మెకానిక్‌లకు ప్రతి నెలా పింఛన్‌గా రూ.5 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కసుమర్తి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు పిట్టు శ్రీనివాసరావు, డైరెక్టర్లు ఎస్. వెంకటేశ్వరరావు, షేక్ కలీల్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం సివిల్ కోడ్‌పై అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షేక్ మౌలాలీ

చల్లపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న యూనిఫాం సివిల్ కోడ్‌తో మైనారిటీలకు నష్టం కలుగుతుందని ముస్లిం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు షేక్ మౌలాలీ అన్నారు. ఆదివారం స్థానిక నారాయణరావు నగర్ గౌసియా మస్జీదు, గ్రామంలోని మహమ్మదీయ మస్జీదుల్లో ముస్లింలకు యూనిఫాం సివిల్ కోడ్ కారణంగా కలిగే నష్టాలు వివరించారు.

మౌలాలీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత సామరస్యం, పరమత సహనం పరిఢవిల్లేందుకు అన్ని మతాలను, ఆయా మత విశ్వాసాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఐక్య వేదిక లీగల్ ఎడ్వైజర్ మహమ్మద్ మస్తాన్ మాట్లాడుతూ న్యాయవాదిగా తనకున్న అవగాహన ప్రకారం యూనిఫాం సివిల్ కోడ్ అమలు సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనలు విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు మహబూబ్ బాషా, అబ్దుల్ అజీజ్, బాషు భాయ్, షేక్ నబీషోరీ, హమీద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నంటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక వలందపాలెంలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం ఫ్యాప్టో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి. లంకేష్, జనరల్ సెక్రటరీలు డి. అశోక్‌కుమార్, జి. హృదయరాజు, ఎల్. సాయిశ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంవీ రాజేంద్రప్రసాద్, జిల్లా కో-చైర్మన్ కె. రాజేంద్రప్రసాద్, కోశాధికారి ఏఆర్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగుల నివారణ

మండవల్లి: మండలంలోని లింగాల గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం 50 లీటర్ల అగ్నాస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ అగ్నాస్త్రం వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించవలసినదిగా కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నాగవిజయ, ఐసీఆర్పీలు రామారావు, రమేష్, ఉషారాణి, శ్రీదేవి, లీడ్ ఫార్మర్ వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కైలే పర్యటన

పామర్రు: నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం పాల్గొననున్నారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది రాంబాబు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామ సచివాలయంలో 11.30 గంటలకు పామర్రు మండలం జుఝువరం గ్రామంలో జరగనున్న సురక్ష క్యాంపులో పాల్గొంటారని తెలిపారు. సాయింత్రం 5 గంటలకు మొవ్వ మండలం కాజ-1 సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారు. కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అందరూ తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మొవ్వ: మండలంలోని కాజ గ్రామంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మొవ్వ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు వెల్లడించారు. కాజ గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పర్యటిస్తారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపు ఇచ్చారు.

రజక సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: రజక సంఘ మాజీ అధ్యక్షుడు, శ్రీ గంగానమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యుడు పోలవరం అర్జున్ (70) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య ఉన్నారు. స్థానిక రజక బజారులో అర్జున్ పార్థివ దేహాన్ని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సందర్శించారు. పుష్పమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజక సంఘ అభివృద్ధికి అర్జున్‌చేసిన సేవలు ప్రశంశనీయమని అన్నారు. పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే వారని అన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, బీసీ నాయకులు సూరవరపు కృష్ణ, పార్టీ నాయకులు మోరా వెంకటరెడ్డి, నందిపాటి సురేష్‌రెడ్డి, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు. మండల పరిధి పసుమర్రు గ్రామ శివారు గంగులవాని చెరువుకు చెందిన గుంటూరు గంగాధరరావు (30) పుల్లేరు కాలువలో పడి మృతి చెందారు. ఆయన మృత దేహాన్ని గుడివాడ ప్రభుత్వ వైద్యశాల శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి: చల్లపల్లి గ్రామ దేవత సంపటాలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి వేద పండితులచే ప్రత్యేక పూజలు చేసి విశేష అభిషేకాలు జరిపించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు ఉప్పల సుబ్బారావు, యార్లగడ్డ శివయ్య, బళ్లా మధు, నరేంద్ర, రాఘవ పర్యవేక్షించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ కుమార్ (నాని) తదితరులు పాల్గొన్నారు.

ఈడేపల్లిలో 'చదువంటే మాకిష్టం'

మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు పత్రికలు, కథల పుస్తకాలు చదివారు. వికాస్ తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, దేశభక్తిపై వక్తృత్వ పోటీలు, కృపాష్టకము శ్లోకాల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలు కె. రాజేంద్రప్రసాద్, పి. హరికిషన్‌ను సత్కరించారు. వికాస్ తరంగిణి ప్రతినిధి మాజేటి లక్ష్మీకాంతం, ఉపాధ్యాయిని లక్ష్మీ, సుధీష్ణ, సుధ తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ పాలకురాలు వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు.